సాక్షి
ఖమ్మం
శనివారం । 27 । జూలై । 2024



భయపెడుతున్న మున్నేరు

ప్రస్తుతానికి ముప్పు లేకున్నా గత ఏడాది జూలైలో మున్నేరుకు వరద పోటెత్తడంతో జరిగిన నష్టాన్ని తలుచుకుని ప్రజలు వణికిపోతున్నారు. 10లో



ధనవంతుల ఇళ్లే టార్గెట్

ధనవంతుల ఇళ్లలో చోరీలకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రూ.21లక్షల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నారు. 10లో

గరిష్టం / కనిష్టం
31° / 25°

వాతావరణం

జిల్లాలో శనివారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. కొన్నిచోట్ల ఆకాశం మేఘావృతమయ్యే అవకాశముంది.

న్యూస్‌రీల్

వైద్యుల నియామకానికి 30న ఇంటర్వ్యూలు

ఖమ్మంవైద్యవిభాగం: ప్రభుత్వ మెడికల్ కాలేజీలో వైద్యుల నియామకానికి ఈనెల 30వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.రాజేశ్వరరావు తెలిపారు. కాంట్రాక్ట్ ప్రాతిపదికన తొమ్మిది మంది ప్రొఫెసర్లు, 11మంది అసోసియేట్ ప్రొఫెసర్లు, ఏడుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లను నియమించనున్నామని పేర్కొన్నారు. ఈనెల 30న ఉదయం 9గంటలకు కాలేజీలో మొదలయ్యే ఇంటర్వ్యూలకు ఆసక్తి, అర్హతలు ఉన్న వారు హాజరుకావాలని సూచించారు. ఇతర వివరాల కోసం జిల్లా వెబ్‌సైట్ లేదా కళాశాల వెబ్‌సైట్ WWW.GMCKHAMMAM.GOV లో పరిశీలించాలని ప్రిన్సిపాల్ తెలిపారు.

పలువురు వైద్యుల డిప్యూటేషన్

జిల్లాలోని పలు ఆస్పత్రుల నుంచి వైద్యులను డిప్యూటేషన్‌పై కొత్త స్థానాలకు కేటాయించారు. వైరాలో పనిచేస్తున్న అనస్తీసియా వైద్యుడు ఏ.లవన్‌కుమార్, డాక్టర్ టి.సురేష్, పీడియాట్రీషియన్ కె.రాజ్‌కుమార్‌ను తిరుమలాయపాలెం ఆస్పత్రికి బదిలీ చేశారు. అలాగే, సత్తుపల్లిలో పనిచేస్తున్న జనరల్ సర్జన్ బి.రమేష్‌ను కల్లూరుకు, ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రి నుంచి డిప్యూటీ డెంటల్ సర్జన్ ఎంఅశోక్, పీడియాట్రీషియన్ కె.శిరీషను నేలకొండపల్లికి డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు.

29న నిధి ఆప్‌కే నిఖత్

ఖమ్మం సహకారనగర్: ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 29న 'నిధి అప్ కే నిఖత్' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పీఎఫ్ రీజినల్ కమిషనర్ కె.సునీల్ ఓ ప్రకటనలో తెలిపారు. సంస్థల యజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్లు పెన్షనర్లు ఈపీఎఫ్ఓ ఆధ్వర్యాన జరిగే ఈ కార్యక్రమంలో పాల్గొనవచ్చని వెల్లడించారు. ఖమ్మం జిల్లాలోని సత్తుపల్లి సర్వారాయ షుగర్స్ లిమిటెడ్‌లో, భద్రాద్రి జిల్లాలోని ఇల్లెందు మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఉదయం 9నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు కార్యక్రమం జరుగుతుందని తెలిపారు.

1నుండి ఇంటర్ తరగతులు ప్రారంభం



విద్యార్థికి అడ్మిషన్ ఇస్తున్న డీఐఈఓ రవిబాబు

కూసుమంచి: కూసుమంచిలో నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో వచ్చేనెల 1నుండి తరగతులు మొదలవుతాయని జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు తెలిపారు. కూసుమంచిలోని రెవెన్యూ అకాడమీ భవనంలో కళాశాల నిర్వహణకు ఏర్పాట్లు చేస్తుండగా ఆయన శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు ప్రవేశాలు పొందగా డీఐఈఓ మాట్లాడారు. పాలేరు ఎమ్మెల్యే, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి చొరవతో కూసుమంచికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరైందని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపుల్లో ఇంగ్లిష్, తెలుగు మీడియాల్లో బోధన జరుగుతుందని, ఈ అవకాశాన్ని మండల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కళాశాల సిబ్బంది సురేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోస్టల్ సూపరింటెండెంట్‌గా వీ.వీ.స్వామి



రవికుమార్‌ను సన్మానిస్తున్న స్వామి, ఉద్యోగులు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం డివిజన్ పోస్టల్ సూపరింటెండెంట్‌గా వి.వీరభద్రస్వామి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడ సూపరింటెండెంట్‌గా ఉన్న బి రవికుమార్‌ను వరంగల్‌కు, కర్ణాటక రాష్ట్రం బీదర్ నుంచి వీరభద్రస్వామిని ఖమ్మంకు కేటాయించారు. ఈ నేపథ్యాన ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఖమ్మం పోస్టల్ సూపరింటెండెంట్‌గా మూడేళ్ల పాటు విధులు నిర్వర్తించిన రవికుమార్‌ను సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. కేంద్రం నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలకు ప్రాధాన్యత ఇవ్వడంతో కొత్తగా 213 బ్రాంచ్ పోస్టాఫీసులను ఏర్పాటు చేయించారని తెలిపారు. అలాగే, ఇండియన్ పోస్టల్ పేమెంట్ బ్యాంక్(ఐపీపీబీ) సేవల్లో డివిజన్‌ను అగ్రగామిగా నిలిపారని వివరించారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం హెడ్ పోస్టాఫీస్ పోస్ట్ మాస్టర్ సుబ్రమణ్యం, పీఆర్ఓ పమ్మి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇక మండలాల్లోనే గ్రీవెన్స్



సాక్షిప్రతినిధి, ఖమ్మం: 'ఏ స్థాయి అధికారులు అక్కడే పని పూర్తిచేయాలి. ప్రతీ రెవెన్యూ సమస్యకు కలెక్టరేట్‌లో పరిష్కారం దొరకదు. పైగా ప్రజలు ఇక్కడికి రావాలంటే శ్రమ. అందుకోసం వచ్చేనెల 5నుంచి ప్రతీ సోమవారం జిల్లాలోని ప్రతీ మండల కేంద్రంలోని తహసీల్ లేదా ఎంపీడీవో కార్యాలయంలో మండలస్థాయి ప్రజావాణి నిర్వహించి అధికారులందరినీ పిలిపిస్తాం. అక్కడే దరఖాస్తులు స్వీకరించి మండల స్థాయి సమస్యలు పరిష్కరిస్తారు.' అని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ వెల్లడించారు. శుక్రవారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో కలెక్టర్ వివిధ అంశాలపై వెల్లడించిన అంశాలు ఆయన మాటల్లోనే..

వచ్చే నెల 5 నుంచి శ్రీకారం

- ప్రతీ బుధవారం పాఠశాలల్లో అధికారుల భోజనం
- ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో మందులు
- 50 ప్రభుత్వ పాఠశాలల్లో న్యూట్రీ గార్డెన్లు
- త్వరలోనే ధరణి దరఖాస్తుల పరిష్కారం
- 'సాక్షి' ఇంటర్వ్యూలో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

ఎక్కడికక్కడే సమస్యల పరిష్కారం

ప్రతీ రెవెన్యూ సమస్యపై ప్రజలు కలెక్టరేట్‌కు రావాలంటే రూ.150, రూ.200 ఖర్చు పెట్టడమే కాక సమయం కేటాయించాలి. ఒకవేళ ఇక్కడ వినతిపత్రం ఇచ్చిన మేం మండలాలకు పంపిస్తాం. అందుకే మండలస్థాయిలోనే పరిష్కారానికి నిర్ణయించాం. ఈ విధానాన్ని తొలుత వైద్యరంగంలో అమలు చేస్తున్నాం. ఎవరైనా పీహెచ్‌సీకి రాగానే వైద్యులు పరీక్షించి మందులు ఇస్తారు. ఆపై ఆశ వర్కర్ అనారోగ్యం తగ్గేవరకు పర్యవేక్షిస్తారు. ఇలా చేస్తే మూడు నెలల్లో ఫలితం ఉంటుంది. ప్రజావాణిలో చూస్తే అంతా ఇక్కడికే వస్తున్నారు. మాకు ఇబ్బంది లేకపోయినా వచ్చే వారికి శ్రమ. అందుకే వచ్చేనెల 5వ నుంచి ప్రతీ సోమవారం తహసీల్ లేదా ఎంపీడీఓ కార్యాలయంలో ప్రజావాణి నిర్వహించి దరఖాస్తులు తీసుకుని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారు. మండలంలో పరిష్కారం కాకాకపోతే ఆర్డీఓ వద్దకు, అయినా కాకపోతేనే కలెక్టరేట్‌లో వచ్చేలా పర్యవేక్షిస్తాం.

పారిశుద్ధ్య సమస్యను పరిష్కరిస్తాం

వర్షాలతో నీరు నిలిచి దోమలు పెరుగుతున్నాయి. పది నుంచి 15 రోజుల్లో ఈ సమస్య పరిష్కరిస్తాం. ఫ్రైడే – డ్రై డే వంటి కార్యక్రమాల్లో ప్రజల భాగస్వాములై ఇళ్లతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. ఇప్పటికే కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తున్నారు. తిరుమలాయపాలెం మండలంలో కొన్ని డెంగీ కేసులు ఉన్నా అన్నీ డెంగీయేనని భయపడొద్దు. పారిశుద్ధ్య పనులకు నిధులు వచ్చాయి. శానిటేషన్ వర్కర్లకు వేతనాలు అందాయి. ఏదైనా సమస్యతో ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్తే భయపెట్టి ఎక్కువ బిల్లులు వేస్తున్నారని అంశంపై డీఎంహెచ్ఓ విచారణ చేస్తున్నారు.

రైతుల ఫ్రెండ్లీ కలెక్టరేట్

అన్ని భవనాలతో పోలిస్తే కలెక్టరేట్‌కు తేడా ఉండాలనేది నా ఉద్దేశం. జిల్లాలో రైతుల సంఖ్య ఎక్కువగా ఉన్న నేపథ్యాన రైతులకు అనుకూలంగా మారుస్తాం. అలాగే ఇక్కడకు కొత్త వారు వచ్చినా జిల్లా చరిత్ర తెలుసుకునేలా గోడలపై 'మన ఖమ్మం' పేరుతో వివరాలు రాయిస్తున్నాం. అలాగే కలెక్టరేట్‌లో యోగాషెడ్, బస్టాప్ సిద్ధమవుతున్నాయి. మహిళా సంఘం సభ్యులతో క్యాంటీన్ ఏర్పాటుచేయిస్తాం.

కుక్కలను నియంత్రిస్తాం

కేఎంసీ పరిధితో పాటు జిల్లా అంతటా కుక్కల సమస్య ఉంది. చాలాచోట్ల అనుమతి లేకుండా కుక్కల విక్రయాలు జరుగుతున్నాయి. ఇకపై ఎవరైనా కుక్కలను అమ్మితే ట్యాగ్ చేయాలి. వ్యాక్సిన్ వేయించకపోతే యజమానులకు జరిమానా విధిస్తాం. కుక్కల వల్ల రేబిస్ సోకడమే కాక వాటికి ఆహారం దొరకకపోతే పరిస్థితి అదుపు తప్పుతుంది. ఇప్పటి వరకు ప్రైవేట్ నిర్వహణలో ఉన్న ఏబీసీ సెంటర్‌ను వెటర్నిటీ శాఖకు అప్పగిస్తున్నాం. సర్జరీల సంఖ్య పెంచి ఆరు నెలల్లో కుక్కల నియంత్రణపై దృష్టి సారించాం.

విద్యార్థుల తల్లులతోనే ఆదర్శ కమిటీలు

జవాబుదారీతనం, ప్రశ్నించేతత్వాన్ని పెంచేందుకు విద్యార్థుల తల్లులతో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలను నియమించాం. ఐదో తరగతి విద్యార్థికి రెండో తరగతి స్థాయి పరిజ్ఞానమే ఉంటే ఆరో తరగతికి పంపకుండా సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రయత్నించాలి. ప్రతీ మండలం నుంచి పాఠశాలల నివేదికలు, ఉపాధ్యాయుల హాజరు, సెలవుల వివరాలు తెప్పించుకుంటున్నా. ఉపాధ్యాయులు కూడా జవాబు దారీగా పనిచేయాలి. మరోపక్క తల్లిదండ్రులు సైతం పిల్లలెలా చదువుతున్నారో తెలుసుకోవాలి. వీటిపై 'అమ్మ' కమిటీల ద్వారా నిఘా పెడుతున్నాం.

పాఠశాలలకు జిల్లా అధికారులు

జిల్లాస్థాయి అధికారులు 63 మంది ప్రతీ బుధవారం ఏదో ఒక పాఠశాలలో భోజనం చేస్తారు. తద్వారా భోజనం నాణ్యత, పరిసరాలు ఎలా ఉన్నాయి.. విద్యార్థుల సామర్థ్యాలు తెలుసుకుని నివేదిక ఇస్తారు. దీనిపై సమీక్షిస్తాం. ఇక 50 శాతం కంటే తక్కువగా విద్యార్థులు హాజరైన రాని వారి ఇళ్లకు వెళ్లి విచారిస్తున్నాం. అలాగే, 50 పాఠశాలల్లోనే న్యూట్రీ గార్డెన్లు ఏర్పాటుచేసి మధ్యాహ్న భోజనానికి కూరగాయలు పండిస్తారు. ఉపాధ్యాయులనూ విద్యార్థులతో కలిసి భోజనం చేయాలని చెబుతున్నాం.

ఆప్యాయంగా మాట్లాడాలి

పీహెచ్‌సీలు, జిల్లా ఆస్పత్రికి వైద్యులు, సిబ్బంది సకాలంలో వస్తున్నారా, లేదా అని చూస్తున్నాం. వైద్యులు ఆస్పత్రికి వెళ్లి ఫొటో తీసి పంపుతున్నారు. ఇటీవల నేను జిల్లా ఆస్పత్రికి వెళ్లినప్పుడు సమస్య తెలుసుకుని ఈ మందులు వాడు అని రెండు ముక్కల్లో చెప్పి పంపిస్తున్నట్లు గుర్తించా. అలాకాకుండా ఆప్యాయంగా మాట్లాడి వివరాలు తెలుసుకోవాలని చెప్పాం. కొన్నిచోట్ల తక్కువగా ఉన్న మందులు తెప్పిస్తున్నాం. కలెక్టరేట్‌లోనూ డిస్పెన్సరీ ఏర్పాటుచేశాం.

6వేల దరఖాస్తులు..

ధరణిలో సమస్యలపై 12వేల వరకు దరఖాస్తులు అందగా ఆరు వేలు పెండింగ్ ఉన్నాయి. ఇందులో ప్రతిరోజు 200 వరకు పరిష్కరిస్తున్నాం. రెండు వారాల్లోగా వీటిని పూర్తిచేస్తాం. అయితే, ఇతర జిల్లాల్లో రోజుకు 20 నుంచి 30 వస్తే మనకు కొత్తగా 90 దరఖాస్తులు వస్తున్నాయి. ప్రత్యేక డ్రైవ్ పూర్తయ్యాక కొత్త దరఖాస్తులను పరిష్కరిస్తాం. అలాగే, దరఖాస్తుదారులకు అవగాహన కల్పించేలా సహాయ కేంద్రాలను ఏర్పాటు చేశాం. రుణమాఫీపైనా హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటుచేసి రైతుల సందేహాలను నివృత్తి చేయిస్తున్నాం.

చి'వరి' భూములకూ సాగునీరు

- రూ.800.50కోట్లతో వైరా, కట్లేరు నదులపై చెక్‌డ్యామ్‌లు, పంప్‌హౌస్‌లు
- తాజా బడ్జెట్‌లో రూ.500 కోట్లు కేటాయింపు
- గతంలోనే సాగర్ ఆయకట్టు జోన్ మార్పు
- 'భట్టి' కృషితో నెరవేరనున్న అన్నదాతల కళ



క్షేత్రస్థాయిలో సర్వే చేస్తున్న ఐబీ అధికారులు (ఫైల్)



పొంగి ప్రవహిస్తున్న కట్లేరు నది

మధిర: మధిర, ఎర్రుపాలెం మండలాల్లో నాగార్జున సాగర్ చివరి ఆయకట్టుకు నీరు అందడం కష్టమవుతోంది. ప్రధానంగా ఎర్రుపాలెం మండలానికి ఏపీలోని పలు ప్రాంతాల్లో సాగర్ కాల్వల మీదుగా రావాలి. దీంతో ఏడాది పొడవునా కెనాల్ చివరి వరకు నీరు వచ్చిన సందర్భాలు తక్కువేనని చెప్పాలి. దీంతో వరి, ఇతర పంటలు సాగు చేసే రైతులకు చివరి దశలో నష్టపోతున్నారు. కొందరు నష్టాన్ని భరిస్తుండగా.. ఇంకొందరు బీళ్లుగా వదిలేస్తున్నారు. మరికొందరు సుబాబుల్, జామాయిల్ వంటి పంటల సాగు మొదలుపెట్టారు. అనేక దశాబ్దాలుగా రైతులను వేధిస్తున్న ఈ సమస్య పరిష్కారానికి ఇప్పుడు అడుగులు పడుతున్నాయి.

డిప్యూటీ సీఎం పదవి దక్కడంతో...

ఏళ్ల తరబడి రైతుల ఆవేదనను చూస్తున్న మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎం, ఆర్థిక శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. మధిర మండలంలో వైరా నది, ఎర్రుపాలెం మండలంలో ప్రవహిస్తున్న కట్లేరు నదులపై చెక్‌డ్యామ్‌లు, పంప్‌హౌస్‌లను నిర్మించి సాగునీటిని ప్రస్తుతం ఉన్న సాగర్ కాల్వలోకి ఎత్తిపోసేలా ప్రణాళికలు సిద్ధం చేయించారు. దీనికి తోడు ఈ ప్రాంతాన్ని సాగర్ కెనాల్ జోన్ – 3 నుంచి 2కు మార్పించారు.

రూ.800.50కోట్లతో అంచనాలు

ఎన్నెస్పీ పరిధిలోని మైలవరం బ్రాంచ్ కెనాల్, జమలాపురం మేజర్, నిధానపురం మేజర్ కాల్వలు ఉండగా రెండు మండలాల్లో వేలాది ఎకరాల ఆయకట్టు ఉంది. కానీ ఇవి చివరి భూములు కావడంతో నీరు అందడంలేదు. ఈ నేపథ్యాన రెండు మండలాల్లో ఆయకట్టు స్థిరీకరణకు రూ.800.50కోట్లు అంచనా విలువతో ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఫీడర్ కెనాళ్ల నిర్మాణానికి రూ.167 కోట్లు, రెండు పంపు హౌస్‌లకు రూ.533 కోట్లు, 32 ఎకరాల భూసేకరణకు రూ.64 కోట్లు, కాల్వల మరమ్మతులు నిర్మాణానికి రూ.35 కోట్లు అవసరమని పొందుపరిచారు. ఇప్పటికే సర్వే పూర్తికావడంతో త్వరలోనే డిజైన్లు ఖరారు చేసి టెండర్లు ఆహ్వానించనున్నారు. ఇంతలోనే గురువారం ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో ఈ ప్రాజెక్టుకు రూ.500 కేటాయించిన నేపథ్యాన పనులు చకచకా సాగే అవకాశముంది.

ఏం చేస్తారంటే....

- మధిర మండలంలో సాగర్ కాల్వ కింద 28,867 ఎకరాల ఆయకట్టు ఉంది. అంతేకాక 30 చెరువుల కింద 7,551 ఎకరాలు, 17లిఫ్టుల కింద 6,027 ఎకరాలు సాగవుతోంది. ఈ భూములన్నింటికీ సాగు నీరు అందించేలా కార్యాచరణ సిద్ధమైంది. ఎన్నెస్పీ కెనాల్ 51.7 కి.మీ. వద్ద తూము నిర్మించి 16.6 కి.మీ. మేర ఫీడర్ కెనాల్ తవ్విస్తారు. ఆపై స్నానాల లక్ష్మీపురం సమీపంలోని కడవటిమిట్ట వద్ద వైరా నదిలోకి నీరు చేరుస్తారు. అక్కడ నుంచి వంగవీడు వద్ద 100 మీటర్ల పొడవుతో 25.92 ఎంసీఎఫ్‌టీ నిల్వ సామర్థ్యంతో నిర్మించే చెక్‌డ్యామ్ వద్దకు తరలిస్తారు. ఆ ప్రాంతంలో పంప్‌హౌస్ నిర్మించి 300 క్యూసెక్కుల నీటిని ఫీడర్ కెనాల్ ద్వారా మధిర బ్రాంచ్ కెనాల్ పరిధిలోని 38.2 కి.మీ. నాగవరప్పాడు వద్ద నిదానపురం మేజర్‌లోకి ఎత్తిపోస్తారు. ఆపై వారబందీ ప్రకారం మధిర మండలానికి సాగునీరు సరఫరా చేస్తారు. మరో వారం నీటిని ఎర్రుపాలెం మండలంలోని అయ్యవారిగూడెం వద్ద కట్లేరులోకి ఎత్తిపోస్తారు.
- ఎర్రుపాలెం మండలంలో సాగర్ ఆయకట్టు కింద 20,862 ఎకరాలు, 52 చెరువుల కింద 8421 ఎకరాలు, ఐదు లిఫ్టుల కింద 1,184 ఎకరాలు ఉంది. ఈ భూములకు నీరందించేలా తొలుత అయ్యవారిగూడెం వద్ద కట్లేరుపై 10 ఎంసీఎఫ్‌టీ నీటి నిల్వ సామర్థ్యంతో రూ.10 కోట్లతో చెక్‌డ్యామ్ నిర్మిస్తారు. అక్కడ పంప్‌హౌస్ సైతం నిర్మించి రెండు ఫీడర్ కెనాళ్ల ద్వారా మైలవరం బ్రాంచ్, జమలాపురం మేజర్ కెనాల్‌లోకి నీటిని వదులుతారు. వైరా నది నుంచి వచ్చే మిగులు నీటితోపాటు కట్లేరు నీరు కలిపి ఈ పంప్‌హౌస్ ద్వారా సాగర్ కాల్వలోకి ఎత్తిపోస్తారు. తద్వారా మండలంలోని చివరి భూములు సైతం సస్యశ్యామలం అవుతాయి. ఒకవేళ వైరా నది నుంచి నీటి లభ్యత లేకపోతే సీతారామ ప్రాజెక్టు నీటిని వైరా రిజర్వాయర్‌కు మళ్లించి అలుగు నీటిని వంగవీడు చెక్‌డ్యామ్ వద్ద నిల్వ చేస్తారు.

ప్రతిపాదనలు పంపించాం...



ఎన్నెస్పీ జోన్ 3 నుంచి 2కు మార్చారు. మధిర, ఎర్రుపాలెం మండలాల్లో సాగర్ ఆయకట్టు చివరి భూముల స్థిరీకరణకు కార్యాచరణ సిద్ధమైంది. వైరా, కట్లేరు నదులపై చెక్‌డ్యామ్‌లు, పంప్‌హౌస్‌లు నిర్మించి సాగర్ కాల్వల్లోకి నీటిని ఎత్తిపోయాలనేది లక్ష్యం. తద్వారా భూములను సస్యశ్యామలం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదిక సమర్పించాం. అక్కడ పరిశీలన అనంతరం డిజైన్లు రూపొందించి టెండర్ల ప్రక్రియ మొదలుపెడతారు.

– రామకృష్ణ, ఐబీ ఈఈ, మధిర

సైనికుల త్యాగాలను స్మరించుకోవాలి

కార్గిల్ విజయ్ దివస్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, పక్కన మేయర్ నీరజ, తదితరులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రజల భద్రత కోసం అహర్నిశలు శ్రమించే సైనికుల త్యాగాలను ఎప్పటికీ స్మరించుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. ఖమ్మంలోని ఫ్రీడం పార్క్‌లో శుక్రవారం నిర్వహించిన కార్గిల్ విజయ్ దివస్‌లో కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, మేయర్ పి.నీరజ పాల్గొని అమరవీరులకు నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ అందరూ ప్రశాంతంగా జీవించడానికి సరిహద్దులో నిద్రాహారాలు మాని పహారా కాస్తున్న సైనికులే కారణమని తెలిపారు. మాజీ సైనికులు, సైనికుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని కలెక్టర్ చెప్పారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారి చంద్రశేఖర్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ కల్నల్ నవీన్ యాదవ్, కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య, మాజీ సైనికుల అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సుబేదార్ మేజర్ మహబూబ్ సుభాని, పి.కృష్ణమూర్తితో పాటు ఏ.సురేష్‌బాబు, వింగ్ కమాండర్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మార్చారు కానీ చెప్పరట..!

కలెక్టరేట్ నుండి ఖమ్మంకు ఎస్సీ ఆర్‌సీఓ కార్యాలయం



బోసిపోయిన కలెక్టరేట్‌లోని ఆర్‌సీఓ కార్యాలయం

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ గురుకులాల ఆర్‌సీఓ కార్యాలయ అధికారుల తీరు విమర్శలకు తావిస్తోంది. కొత్త కలెక్టరేట్ ప్రారంభించాక ఖమ్మంలోని ఆర్‌సీఓ కార్యాలయాన్ని గత కలెక్టర్ ఆదేశాలతో అక్కడకు తరలించారు. అయితే, నిత్యం కలెక్టర్ పర్యవేక్షణ ఉండడంతో కాస్త ఇబ్బంది పడిన అధికారులు.. ఆనాటి నుంచే పాత కార్యాలయానికి వచ్చేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. ఇంతలోనే గత కలెక్టర్ బదిలీ అవడం, ఎస్సీ గురుకుల విద్యాలయాల సంస్థ ఆర్‌సీఓ వ్యవస్థను రద్దు చేసి జోనల్ వ్యవస్థను తీసుకరావడంతో అధికారులు ఇదే అదునుగా తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు. కొత్తగా వచ్చిన కలెక్టర్‌కు దరఖాస్తు చేసుకుని అనుమతి లభించిందే తడవుగా కలెక్టరేట్‌లోని ఆర్‌సీఓ కార్యాలయాన్ని ఖమ్మంలోని పాత భవనానికి మార్చేశారు. కానీ ఈ విషయాన్ని కార్యాలయ గదిపై నోటీసు ఏర్పాటుచేయడమో లేదంటే ఇతర మార్గాల్లో ప్రచారం చేయాలనే ఆలోచన మాత్రం వారికి రాలేదు. దీంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కొత్త కలెక్టరేట్‌కు వచ్చి కార్యాలయాన్ని మార్చిన విషయం తెలియడంతో ఉసూరుమంటూ వెనుతిరుగుతున్నారు.

శాతవాహన, గోల్కొండ రైళ్ల రద్దు

పలు ఎక్స్‌ప్రెస్ రైళ్ల దారి మళ్లింపు



ఖమ్మంరాపర్తినగర్: కాజీపేట – విజయవాడ రైల్వే మార్గంలో మూడో లైన్ నిర్మాణ పనులు జరుగుతుండడంతో పలు రైళ్లను రద్దుచేయగా.. ఇంకొన్నింటిని దారి మళ్లిస్తున్నట్లు ఖమ్మం రైల్వే కమర్షియల్ ఇన్‌కమ్‌ట్యాక్స్ ఆఫీసర్ ఎం.డీ. జాఫర్ తెలిపారు. విజయవాడ నుంచి భద్రాచలం రోడ్(07979), భద్రాచలం రోడ్-విజయవాడ ప్యాసింజర్ రైలు(07278), డోర్నకల్ – విజయవాడ వెళ్లే పుష్‌పుల్(07756), విజయవాడ – డోర్నకల్ వెళ్లే పుష్‌పుల్(07755)ను వచ్చే నెల 5 నుంచి 10 వరకు రద్దు చేస్తున్నట్లు వెల్లడించారు. అలాగే, శాతవాహన, గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రెండు మార్గాల్లో వచ్చేనెల 5 నుంచి 10 వరకు రద్దు చేయనున్నట్లు తెలిపారు. అంతేకాక వచ్చేనెల 2 నుంచి 10 వరకు సికింద్రాబాద్ – విశాఖపట్నం గరీబ్‌రథ్ (12740), ముంబై – భువనేశ్వర్ కోణార్క్ (11019) వచ్చేనెల 2 నుంచి 10వ తేదీ వరకు, టాటానగర్ వెళ్లే యశ్వంత్‌పూర్ ఎక్స్‌ప్రెస్(18112) వచ్చేనెల 4న, హైదరాబాద్ – హౌరా ఈస్ట్‌కోస్ట్ (18046) వచ్చేనెల 3 నుంచి 11 వరకు, సాయినగర్ షిర్డీ (17205) ఆగస్టు 4, 6, 8వ తేదీల్లో రాయనపాడు మీదుగా రాకపోకలు సాగిస్తాయని చెప్పారు. ఇక విశాఖపట్నం – షిర్డీ ఎక్స్‌ప్రెస్(18045) ఆగస్టు 2 నుంచి 9 వరకు, న్యూఢిల్లీ – విశాఖపట్నం రైలు(20806) ఆగస్టు 2నుంచి 10 వరకు, హైదరాబాద్ – విశాఖపట్నం గోదావరి ఎక్స్‌ప్రెస్ (12728) ఆగస్టు 3నుంచి 11 వరకు, విశాఖపట్నం – న్యూఢిల్లీ ఎక్స్‌ప్రెస్(20805) ఆగస్టు 2నుంచి 10 వరకు, భువనేశ్వర్ – ముంబై కోణార్క్ ఎక్స్‌ప్రెస్ (11020) ఆగస్టు 2నుంచి 10 వరకు, హౌరా – హైదరాబాద్ వెళ్లే ఈస్ట్‌కోస్ట్(18045) వచ్చేనెల 7నుంచి 10 వరకు రాయనపాడు మీదుగా రాకపోకలు సాగిస్తాయని తెలిపారు. అంతేకాక మచిలీపట్నం, చార్మినార్, పద్మావతి, సింహపురితో పాటు మరికొన్ని రైళ్లను సైతం దారి మళ్లిస్తున్నట్లు ఆయన వెల్లడించారు.

ఐదుగురు తహసీల్దార్లు బదిలీ

ఖమ్మం సహకారనగర్: జిల్లాలో వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న తహసీల్దార్లను బదిలీ చేస్తూ కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈనేపథ్యాన కొణిజర్ల తహసీల్దార్ ఆర్.రాంబాబును మధిరకు, మధిర తహసీల్దార్ డి.వెంకటేశ్వర్లును కలెక్టరేట్‌లోని ధరణి సెక్షన్‌కు, చింతకాని తహసీల్దార్ ఏ.వెంకటేశ్వర్లును కల్లూరు ఆర్‌డీఓ కార్యాలయానికి, కలెక్టరేట్ సూపరింటెండెంట్ తఫ్జల్ హుస్సేన్‌ను కొణిజర్ల తహసీల్దార్‌గా బదిలీ చేశారు. అలాగే, కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా నుంచి వచ్చిన కె.అనంతరాజును చింతకాని కేటాయించారు.

పకడ్బందీగా కేజీబీవీల నిర్వహణ

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయాల నిర్వహణ పకడ్బందీగా జరిగేలా పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ మధుసూదన్‌నాయక్ సూచించారు. కలెక్టరేట్‌లో శుక్రవారం ఆయన కేజీబీవీల ప్రిన్సిపాళ్లతో సమావేశమయ్యారు. జిల్లాలోని 14 కేజీబీవీల్లో 4,775 మంది విద్యార్థులకు బోధన, వసతి కల్పన, మెనూ ప్రకారం భోజనం అమలులో లోటుపాట్లు రానివ్వొద్దని తెలిపారు. డీఈఓ సోమశేఖరశర్మ, భూలక్ష్మి పాల్గొన్నారు.

గురుకులాల్లో ప్రవేశాలకు స్పాట్ కౌన్సెలింగ్

ఖమ్మంమయూరిసెంటర్: ఎస్సీ బాలికల గురుకుల జూనియర్ కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి శుక్రవారం టేకులపల్లి గురుకులంలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించారు. రీజియన్ పరిధిలోని 181 సీట్లను ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ విద్యార్థులకు కేటాయించారు. జోనల్ అధికారి ప్రత్యూష, డీసీఓ ఎం.రాజ్యలక్ష్మి, ప్రిన్సిపాళ్లు సునీత, పీ.వీ.పద్మావతి, జి.సునీత పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాధ్యతగా విధులు నిర్వర్తించాలి


ఎస్సైలను అభినందిస్తున్న సీపీ

ఖమ్మంక్రైం: పదోన్నతిని బాధ్యతగా భావించి మరింత మెరుగ్గా విధులు నిర్వర్తించాలని పోలీసు కమిషనర్ సునీల్‌దత్ సూచించారు. కమిషరేట్ పరిధిలో ఏఎస్సైలుగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న సీహెచ్.లింగయ్య, ఆర్.వెంకటరమణ, బాలస్వామినాథం, రామలింగారెడ్డి ఎస్సైలుగా పదోన్నతి పొందగా శుక్రవారం సీపీని కలిశారు. ఈ సందర్భంగా వారిని అభినందించి మాట్లాడారు. అడిషనల్ డీసీపీ ప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఎన్‌ఆర్‌ఐ సెల్ కన్వీనర్‌గా నరేందర్‌రెడ్డి


నరేందర్‌రెడ్డి

తిరుమలాయపాలెం: కాంగ్రెస్ పార్టీ ఎన్‌ఆర్‌ఐ సెల్ కన్వీనర్‌గా మండలంలోని ఏలువారిగూడెంకు చెందిన ఎల్మారెడ్డి నరేందర్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వామపక్ష ఉద్యమ నేపథ్యం కలిగిన కుటుంబం నుండి వచ్చిన నరేందర్‌రెడ్డి తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఐదేళ్లుగా అమెరికాలో సాఫ్ట్‌వేర్ రంగంలో కొనసాగుతున్నారు.

జిల్లాకు కేంద్ర సర్వీసుల అధికారులు

- 29నుంచి ఐదు గ్రామాల్లో అధ్యయనం

నేలకొండపల్లి: కేంద్ర సర్వీసుల్లోని ఉన్నతాధికారుల బృందాలు శిక్షణలో భాగంగా జిల్లాకు రానున్నాయి. ఐదుగురు చొప్పున ఐదు బృందాలు ఈనెల 29నుంచి ఆగస్టు 3వ తేదీ వరకు ప్రభుత్వ పథకాల అమలును పర్యవేక్షించనున్నారు. కాగా, జిల్లాలోని ఐదు గ్రామాలను ఎంపిక చేయగా ఇందులో నేలకొండపల్లి మండలంలోని నాచేపల్లి ఉందని సమాచారం.

ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మెడికల్ సూపరింటెండెంట్ ఎల్.కిరణ్‌కుమార్ తెలిపారు. ఐదు స్టాఫ్‌నర్సు పోస్టులకు గాను జనరల్ నర్సింగ్, బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేసిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అంతేకాక రేడియాలజీ టెక్నీషియన్, ఎఫ్ఎన్‌ఓ, ఎంఎన్‌ఓ పోస్టులు ఒక్కొక్కటి భర్తీ చేయనున్నట్లు తెలిపారు. బయోడేటా, సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో పాటు జనరల్ అభ్యర్థులైతే రూ.500, ఎస్సీ, ఎస్టీలైతే రూ.300 డీడీని 'మెడికల్ సూపరింటెండెంట్, ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి' పేరిట తీసి ఆగస్టు 4లోగా అందజేయాలని సూచించారు.

ఖమ్మం మార్కెట్‌కు మూడు రోజుల సెలవులు

ఖమ్మంవ్యవసాయం: వారాంతపు సెలవులు, బోనాల పండుగ సందర్భంగా ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు శనివారం నుంచి సోమవారం వరకు సెలవులు ప్రకటించామని ఉన్నత శ్రేణి కార్యదర్శి పి.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శని, ఆదివారాలు వారాంతపు సెలవులు కాగా, సోమవారం బోనాల పండుగ సందర్భంగా ప్రభుత్వం సెలవు ప్రకటించిందని పేర్కొన్నారు. తిరిగి మంగళవారం మార్కెట్ కార్యకలాపాలు మొదలవుతాయని తెలిపారు.

ప్రైవేట్ ల్యాబ్‌ల్లో తనిఖీ

కల్లూరు: కల్లూరులోని ప్రైవేట్ రక్త పరీక్షా కేంద్రాలను డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సీతారాం శుక్రవారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల ధరల వివరాలతో బోర్డు ఏర్పాటుచేయాలని, తప్పుడు నివేదికలు ఇచ్చి డెంగీ పేరిట ప్రజలకు ఆందోళనకు గురి చేయొద్దని సూచించారు. కాగా, న్యూప్రతాప్ ల్యాబ్‌లో అర్హులైన సిబ్బంది లేనట్లు తేలడంతో నోటీసు ఇచ్చారు. వైద్యాధికారి నవ్యకాంత్, ఉద్యోగులు రేవతి, రామారావు, చార్లెస్ పాల్గొన్నారు.

నల్లబెల్లం స్వాధీనం

ఖమ్మంరూరల్: మండలంలోని వెంకటగిరి క్రాస్ వద్ద శుక్రవారం రాత్రి చేపట్టిన తనిఖీల్లో 18 క్వింటాళ్ల నల్లబెల్లం, పది లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారు. జగ్గయ్యపేట నుండి మహబూబాబాద్‌కు వాహనంలో తరలిస్తున్న బెల్లం, సారా స్వాధీనం చేసుకుని మహబూబాబాద్ జిల్లా కంబాలపల్లికి చెందిన సప్పిడి సతీష్, రమేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ అధికారి కె.తిరుపతి తెలిపారు.

గంజాయి విక్రయిస్తున్న విద్యార్థుల అరెస్ట్

మేడ్చల్‌రూరల్: జొమాటో బ్యాగ్‌ల్లో గంజాయి తరలిస్తున్న విద్యార్థులను పోలీసులు శుక్రవారం అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ సీఐ నవనీత తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం జిల్లా కొణిజర్లకు చెందిన విద్యార్థి శరత్, వెంకటాపురానికి చెందిన సుతారి గుణశేఖర్‌తో కలిసి శుక్రవారం మధ్యాహ్నం జొమాటో బ్యాగ్‌లో 8.6 కేజీల గంజాయి తరలిస్తూ పట్టుబడ్డారు. వీరు నల్లగొండ జిల్లాకు చెందిన అభిరామ్, ఎర్ర ఆదిత్యతో కలిసి 40 కిలోల గంజాయి తీసుకొచ్చి కరీంనగర్ జిల్లా వేములవాడకు చెందిన వ్యాపారి కటికెల వినయ్ నిల్వ చేశారని తేలింది. దీంతో వినయ్, ఆదిత్యను అదుపులోకి తీసుకోగా వారి వద్ద 4.4 కిలోల గంజాయి లభించిందని సీఐ తెలిపారు.

భయపెడుతున్న మున్నేరు..


గతేడాది మున్నేరు వరదతో మునిగిన పద్మావతి నగర్‌లోని ఇళ్లు


ప్రస్తుతం మున్నేరులో వరద ప్రవాహం

- వరద విలయానికి నేటితో ఏడాది
- ఆ సమయాన పోటెత్తిన వరదతో పరీవాహక ప్రాంతం మునక
- మళ్లీ తాజా వర్షాలతో మున్నేరుకు జలకళ
- ముప్పు లేకున్నా గత స్మృతులతో వణికిపోతున్న స్థానికులు

ఖమ్మంమయూరిసెంటర్: ప్రస్తుతానికైతే మున్నేరు ప్రశాంతంగా ఉంది. ఎలాంటి వరద సూచనలు కూడా లేకపోగా ఆరు అడుగుల మేర నీరు ప్రవహిస్తోంది. అయినా పరీవాహక ప్రాంత ప్రజలు వణికిపోతున్నారు. అధికారులు సైతం హడావుడిగా ముందస్తు జాగ్రత్తలపై దృష్టి సారించారు. ఎందుకంటే సరిగ్గా ఏడాది క్రితం ఇదే నెల 27న మున్నేరుకు వచ్చిన వరదలు అటు అధికార యంత్రాంగాన్ని, ఇటు ప్రభుత్వంతో పాటు పరీవాహక ప్రాంత ప్రజలను ఆందోళనకు గురిచేశాయి. రాత్రికి రాత్రే ఒక్కసారిగా వచ్చిన వరదలో చిక్కుకుని బిక్కుబిక్కుమంటూ గడిపిన క్షణాలు గుర్తుకొస్తే ప్రజలకు దడ పుడుతోంది. ప్రశాంతంగా ఉండే మున్నేరు ఎలాంటి హెచ్చరిక లేకుండానే ఉప్పొంగే అవకాశముండడంతో తాజాగా వర్షాలతో అధికారులు సైతం అప్రమత్తమయ్యారు.

గతేడాది ఇదే సమయంలో వర్షాలు

ఖమ్మం జిల్లాతో పాటు ఉమ్మడి వరంగల్ జిల్లాలో గతేడాది ఇదే సమయంలో వర్షాలు కురవడం, మున్నేటికి వరద పోటెత్తడంతో ఖమ్మం నగరం, ఖమ్మంరూరల్ మండల పరీవాహక ప్రాంతాల్లో హైటెన్షన్ నెలకొంది. ఏటికి ఇరువైపులా 20 కాలనీలకు పైగా పూర్తిగా జలమయమయ్యాయి. గతేడాది జూలై 22 నుండి 25వ తేదీ వరకు ఉమ్మడి వరంగల్‌లో భారీ వర్షాలు, జిల్లాలోని ఖమ్మంరూరల్, తిరుమలాయపాలెం మండలాల్లో భారీ వర్షాలు కురవడం మున్నేరుకు వరద పోటెత్తడానికి కారణమైంది. ప్రస్తుతం వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో ఎగువ ప్రాంతాల్లోని చెరువులు, కుంటల్లోకి వర్షపు నీరు చేరుతోంది. భారీ వర్షాలు కురిస్తే రాత్రికి రాత్రే అవి నిండి వరదనీరు మున్నేరులోకి చేరే అవకాశం ఉంది.

30.70 అడుగుల మేర వరద

గతేడాది జూలై నెలలో కురిసిన భారీ వర్షాలతో మున్నేరుకు భారీ వరద వచ్చింది. 2023 జూలై 26న రాత్రికి రాత్రి మున్నేరుకు వరద రావడం, 27న ఖమ్మంలోని కాల్వొడ్డు వద్ద 30.70 అడుగుల మేర వరద ప్రవహించడంతో నగరంలోని కాల్వొడ్డు, బొక్కలగడ్డ, వెంకటేశ్వరనగర్, పద్మావతినగర్, మోతీనగర్, రామన్నపేట, దంసలాపురం కాలనీ, ఖమ్మం రూరల్ మండలంలోని పోలేపల్లి, కరుణగిరి, రాజీవ్ గృహకల్ప, పెద్దతండా, కోటనారాయణపురం తదితర ప్రాంతాల్లోకి వరద నీరు చేరింది. ఇళ్ల మధ్య నుండి భారీగా వరద ప్రవహించడంతో ప్రహరీలు కూలిపోవడం, కొన్ని ఇళ్ల పైకప్పులు కొట్టుకుపోవడం, మరికొన్ని ఇళ్లలోకి వరద చేరి నేలమట్టం కావడంతో ప్రజలు సర్వం కోల్పోయారు. రాత్రికి రాత్రి వచ్చిన భారీ వరద కారణంగా మున్నేటి పరివాహక ప్రాంతాల్లోని 1,888 ఇళ్లకు నష్టం జరిగినట్లు తేల్చారు.

అప్రమత్తత అవసరం..

మున్నేరుకు ఎప్పుడు వరద వస్తుందో అంచనా వేయలేని పరిస్థితి ఉంది. ఎగువ ప్రాంతాల్లో కురిసే వర్షాలతో మున్నేరు ఉప్పొంగడం ఆనవాయితీ. 2023 జూలై 27 తేదీన వచ్చిన వరద గత 18 ఏళ్లల్లో ఎన్నడూ చూడలేదని స్థానికులు చెబుతున్నారు. ఈనేపథ్యాన మున్నేరుకు ఇరువైపులా ఆర్‌సీసీ వాల్ (కరకట్ట) నిర్మించాలని నిర్ణయించారు. ఇటీవలే పనులు ప్రారంభమయ్యాయి. అయితే, మళ్లీ వరద వస్తే కనక మున్నేరు పరీవాహక ప్రాంత ఇళ్లల్లోకి నీరు అవకాశముంది. ప్రస్తుతం మున్నేరు కాల్వొడ్డు వద్ద ఆరు అడుగుల మేర నీటి ప్రవాహం కొనసాగుతోంది. 16 అడుగుల మేర వరద వస్తే మొదటి ప్రమాద హెచ్చరిక, 24 అడుగులకు చేరితే రెండో ప్రమాద హెచ్చరిక జారీ చేసి లోతట్టు ప్రాంతవాసులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తారు. ఈ నేపథ్యాన ఖమ్మం నగర పాలక సంస్థ అధికారులు మున్నేరుపై ఓ కన్నేశారు. వరద ప్రభావం లేకున్నా కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య, ఇంజనీరింగ్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.

అప్రమత్తంగా ఉన్నాం..

మున్నేరుకు ఇప్పుడైతే వరద తాకిడి లేదు. ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలు కురిస్తే వరద పెరిగే అవకాశముంది. పాకాల చెరువు నుండి ఎక్కువగా నీరు చేరుతుంది. ఇప్పుడు ఆ చెరువే నిండలేదు. దీంతో మున్నేరుకు వరద తాకిడి లేకున్నా యంత్రాంగం అప్రమత్తంగా ఉంది.

– కృష్ణాలాల్, ఈఈ, కేఎంసీ

పరిసరాల పరిశుభ్రతతోనే వ్యాధులకు చెక్


నాచారంలో శానిటేషన్‌ను పరిశీలిస్తున్న డీపీఓ హరికిషన్

ఏన్కూరు: ప్రతిఒక్కరు తమ ఇళ్లలోనే కాక పరిసరాల పరిశుభ్రతపైనా దృష్టి సారించాలని, తద్వారా వ్యాధుల బారిన పడకుండా కాపాడుకోవచ్చని జిల్లా పంచాయితీ అధికారి హరికిషన్ తెలిపారు. ఏన్కూరు మండలం జన్నారం ఎస్టీ కాలనీ, ఏన్కూరు, రేపల్లెవాడ, నాచారంల్లో శుక్రవారం ఫ్రైడే డ్రై డే కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించారు. పారిశుద్ధ్య కార్యక్రమాలు, తాగునీటి క్లోరినేషన్‌ను పరిశీలించాక డీపీఓ మాట్లాడుతూ వర్షాకాలం సీజనల్ వ్యాధులు ప్రబలేఅవకాశమున్నందున ఇళ్ల ఎదుట మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని తెలిపారు. ఎంపీడీఓ సకినాల రమేష్, ఎంపీఓ జి.వెంకటసత్యనారాయణ, పంచాయితీ కార్యదర్శులు పి.శ్రీనివాస్, డి.కిష్టయ్య, బి.బాలాజీ, పి.కుష, జె.స్నేహలత పాల్గొన్నారు.

ఆలయ పాలకవర్గం ప్రమాణస్వీకారం


ప్రమాణ స్వీకారం అనంతరం పాలకమండలి సభ్యులు

ముదిగొండ: ముదిగొండ మండలం ముత్తారంలోని శ్రీసీతారామచంద్రస్వామి వారి దేవస్థానం నూతన పాలకవర్గ బాధ్యులు శుక్రవారం ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ చైర్మన్‌గా తుళ్లూరి జీవన్‌బాబుతోపాటు సభ్యులుగా చెన్ను అమ్మయ్య, కాకి వీరభద్రం, వనం వెంకటేశ్వరరావు, గండవనేని శ్రీనివాసరావు, లంజపల్లి మమత, తాళ్ల ఉపేందర్‌తో దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సమత ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం చైర్మన్ జీవన్‌బాబు మాట్లాడుతూ భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించడమే కాక ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని తెలిపారు. తొలుత ప్రధాన అర్చకులు బొర్రా వాసుదేవాచార్యులు, బొర్రా శ్రీనివాసాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వనం దుర్గాప్రసాద్, వివిధ పార్టీల నాయకులు వాసిరెడ్డి రామనాథం, మందరపు నాగేశ్వరరావు, మల్లెల అజయ్, కందిమళ్ల వీరబాబు, కందుల బాలచందర్, కోలేటి నాగేశ్వరరావు, ఎండీ.అజ్గర్, మట్టా బాబురాంరెడ్డి, వడ్డేపూడి వెంకటేశ్వర్లు, బిచ్చాల అన్వేష్, రాఘవ, ఐనాల నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

'సీతారామ'కు రూ.2 వేల కోట్లు కేటాయించాలి

కామేపల్లి: ఉమ్మడి జిల్లాలో ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే సీతారామ ప్రాజెక్టుకు రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించిన రూ.687 కోట్లు నిధులు రైతులకు పరిహారం చెల్లించేందుకు కూడా సరిపోవని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పోతినేని సుదర్శన్‌రావు తెలిపారు. ఈనేపథ్యాన కనీసం రూ.2వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కామేపల్లిలో శుక్రవారం రైతు సంఘం నాయకుడు దుగ్గి కృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర బడ్జెట్‌లో జిల్లాలోని సాగునీటి ప్రాజెక్టులకు అన్యాయం జరిగిందని తెలిపారు. ఇకనైనా నిధులు పెంచి కామేపల్లి మండలం మీదుగా వెళ్లాల్సిన కాల్వ పనులను వెంటనే ప్రారంభించాలని, రైతులకు మార్కెట్ ధర ఆధారంగా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈసమావేశంలో నాయకులు బొంతు రాంబాబు, మాదినేని రమేష్, తీర్థాల చిదంబరరావు, కొండెబోయిన నాగేశ్వరరావు, రెడబోతు గోపీరెడ్డి, ఏపూరి లతాదేవి, మూడ్ కృష్ణప్రసాద్‌నాయక్, యింజం నాగభూషణం, ముళ్ల ఏకాంబరం, వజ్జా రామారావు, సకినాల శ్రీనివాసరావు, కుందనపల్లి నరేంద్ర, బాలాజీ, వెంకన్న, మల్లెంపాటి శ్రీనివాసరావు, లక్ష్మయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

మాతృత్వపు మమకారం..


రక్తమోడుతున్నా బిడ్డకు పాలిస్తున్న వానరం

కల్లూరురూరల్: ఎలా అయిందో.. ఏం తగిలిందో తెలియదు కానీ ఓ తల్లి కోతి తలకు బలమైన గాయమైంది.. రక్తమోడుతూ స్పృహ కోల్పోయే స్థితికి చేరింది. అంతలోనే ఆ కోతి బిడ్డ వచ్చి పాల కోసం స్తన్యం వెతుకుతుండడంతో అక్కున చేర్చుకుని పాలు ఇచ్చి తల్లి బాధ్యతను నెరవేర్చింది. కల్లూరులోని వేణుగోపాలస్వామి ఆలయం శుక్రవారం దృశ్యం కనిపించింది. అయితే, తల్లి కోతి బిడ్డకు పాలు ఇస్తూనే స్పృహ కోల్పోయే స్థితికి చేరిందని గుర్తించిన స్థానికులు అజహర్, అశ్వక్, పండు, రామకృష్ణ, రాకేష్ తదితరులు దాన్ని పశు వైద్యాధికారి వద్దకు తీసుకెళ్లి వైద్యం చేయించాక వదిలిపెట్టారు.

ధనవంతుల ఇళ్లే టార్గెట్..

- రెండు సార్లు పట్టుబడినా మారని తీరు
- చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్, రూ.21లక్షల సొత్తు స్వాధీనం


నిందితుడి వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీలు రమణమూర్తి, భోజరాజు

ఖమ్మంక్రైం: ఆన్‌లైన్ బెట్టింగ్, విలాసవంతమైన జీవితానికి అలవాటు పడిన ఆ యువకుడు చోరీల బాట పట్టాడు. రెండుసార్లు పోలీసులకు చిక్కినా తీరు మార్చుకోక మళ్లీ పట్టుబడ్డాడు. ఈమేరకు నిందితుడి వివరాలను ఖమ్మం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో నగర ఏసీపీ రమణమూర్తి, సీసీఎస్ ఏసీపీ భోజరాజు వివరాలు వెల్లడించారు.

జిమ్ కోచ్‌గా ప్రారంభం....

ఖమ్మం అర్బన్ మండలం బల్లేపల్లి పాండురంగాపురానికి చెందిన సంపటి ఉమాప్రసాద్ అలియాస్ ఉమ ఖమ్మంలోని ఓ జిమ్‌లో కోచ్‌గా పనిచేస్తూ ఆర్మీ ఉద్యోగానికి ప్రయత్నించాడు. మెడికల్ టెస్ట్‌లో విఫలం కావటంతో.. ఎవరెస్ట్ శిఖరం ఎక్కాలని శిక్షణపై ఆరా తీస్తే చాలా డబ్బు కావాలని తెలిసింది. దీంతో రెండేళ్ల క్రితం దొంగతనాలు మొదలుపెట్టాడు. ఈమేరకు బైక్‌పై తిరుగుతూ ధనవంతులను ఇళ్లను గుర్తించి తాళం వేసి ఉన్న సమయాన చోరీలు చేసేవాడు. దీంతో గతంలో పోలీసులకు చిక్కి కొంతకాలం శిక్ష అనుభవించి బయటకు వచ్చాక ఏపీ, కేరళలో దొంగతనాలు చేశాడు. కేరళలోనూ పోలీసులకు చిక్కి బయటకు వచ్చిన ఉమాప్రసాద్ మకాం హైదరాబాద్‌కు మార్చాడు. అక్కడ దొంగిలించిన డబ్బుతో బైక్ కొనుగోలు చేసి దొంగతనాలు చేసేవాడు. హైదరాబాద్‌లో నిఘా పెరగడంతో ఖమ్మం సారధినగర్‌లో గది అద్దెకు తీసుకున్నాడు. ఉదయమంతా తిరుగుతూ ధనవంతుల ఇళ్లను గుర్తించి తాళం వేసినప్పుడు డబ్బు, బంగారం చోరీ మొదలుపెట్టాడు. ఆ డబ్బుతో గోవాలో క్యాసినోవా ఆడి తిరిగి వచ్చి దొంగతనాలు చేయడం అలవాటుగా మార్చుకున్నాడు. కాగా, చోరీకి వెళ్లినప్పుడు మాస్క్ ధరించే ఉమాప్రసాద్ అవసరమైతే రెండు అంతస్తుల భవనం పైనుంచైనా దూకుతాడని, పైపుల ద్వారా పాకుతూ ఎక్కుతాడని పోలీసులు గుర్తించారు. సీసీఎస్, ఖమ్మం త్రీటౌన్ పోలీసులు శుక్రవారం గాంధీచౌక్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న ఉమాప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. ఆయనపై ఖానాపురం హవేలీ, వైరాలో రెండేసి కేసులు, ఖమ్మం టూటౌన్ పరిధిలో మూడు, త్రీటౌన్ పరిధిలో ఒక కేసు ఉందని గుర్తించగా.. రూ.21లక్షల విలువైన 29 తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అరెస్ట్ చేయడంలో కీలకంగా వ్యవహరించిన సీసీఎస్, త్రీ టౌన్ సీఐలు బాలాజీ, రాజు, రమేష్, ఉద్యోగులు కోలా శ్రీను, మంగిత్యా, గజేంద్ర, ఎస్.శ్రీనివాస్, సుధాకర్‌ను ఏసీపీలు అభినందించారు.

నేడు అయ్యప్ప ధర్మప్రచార సభ రాష్ట్ర కార్యవర్గ సమావేశం

ఖమ్మంఅర్బన్: అఖిల భారతీయ అయ్యప్ప ధర్మ ప్రచార సభ రాష్ట్ర కార్యవర్గ సమావేశం శనివారం మినర్వా గ్రాండ్ బాంక్వెట్ హాల్‌లో మధ్యాహ్నం ఒంటిగంటకు ప్రారంభమవుతుందని రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు బేతి తిరుమల్‌రావు, టీవీ పుల్లంరాజు తెలిపారు. ఈ సమావేశానికి హాజరుకావాలని కోరుతూ మేయర్ పునుకొల్లు నీరజను శుక్రవారం ఆహ్వానించారు. కాగా, జాతీయ అధ్యక్షుడు కె.అయ్యప్పదాస్, ఏపీ, తమిళనాడు రాష్ట్రాల అధ్యక్షులు డాక్టర్ పైలా ఆడిమోహన్‌రెడ్డి, పార్థసారథి హాజరుకానుండగా, ఇదే వేదికపై ఆదివారం జాతీయ కార్యవర్గ సమావేశం జరుగుతుందని వారు వెల్లడించారు.

రేపటి నుంచి బీఆర్‌ఏఓయూ తరగతులు

ఖమ్మంసహకారనగర్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ(బీఆర్‌ఏఓయూ)లో డిగ్రీ మొదటి సంవత్సరం సెకండ్ సెమిస్టర్ తరగతులు ఈ నెల 28వ తేదీన ప్రారంభం కానున్నాయి. ఈ విషయాన్ని రీజినల్ కోఆర్డినేటర్, ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మహ్మద్ జకీరుల్లా తెలిపారు. ఖమ్మం ఎస్‌ఆర్ అండ్ బీజీఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్రంలో ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు తరగతులు కొనసాగుతాయని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 7382929607 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

విద్యుదాఘాతంతో బాలిక మృతి

- తడిచేతులతో సెల్ చార్జింగ్ పెడుతుండగా ఘటన


అంజలి కార్తీక (ఫైల్)

చింతకాని: మండలంలోని మత్కేపల్లి గ్రామంలో విద్యుదాఘాతంతో బాలిక మృత్యువాత పడింది. గ్రామానికి చెందిన కటికాల రామకృష్ణ కుమార్తె అంజలి కార్తీక (8) స్థానిక పాఠశాలలో నాలుగో తరగతి చదువుతోంది. శుక్రవారం ఉదయం ఆమె తన తండ్రి సెల్‌ఫోన్‌కు తడిచేతులతో చార్జింగ్ పెడుతుండగా ప్రమాదవశాత్తు షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో బాలికను తల్లిదండ్రులు స్థానిక గ్రామీణ వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. ఘటనపై తండ్రి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు. కాగా, కాసేపటల్లో పాఠశాలకు వెళ్లేందుకు సిద్ధమవుతున్న కుమార్తె మృత్యువాత పడడంతో కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

రైలు నుండి జారిపడి బిహార్ వాసి..

ఖమ్మంక్రైం: ప్రమాదవశాత్తు రైలు నుంచి జారి పడడంతో బీహార్ వాసి మృతి చెందిన ఘటన ఖమ్మంలో శుక్రవారం చోటు చేసుకుంది. బిహార్ రాష్ట్రంలోని మధుబానీ జిల్లా జయ్‌నగర్‌కు చెందిన లలిత్ సద్రై(22) తన స్నేహితులతో కలిసి పనినిమిత్తం పట్నా నుంచి చైన్నై వెళ్తుండగా ఖమ్మం రైల్వేస్టేషన్ సమీపాన రామన్నపేట వద్ద కింద పడ్డాడు. ఆయన స్నేహితులు కేకలు వేస్తున్నా రైలు వేగంగా ఉండడం, ఖమ్మంలో స్టాప్ లేకపోవడంతో విజయవాడకు వెళ్లాక అక్కడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసి తిరిగి ఖమ్మం వచ్చారు. ఇంతలోనే సమాచారం అందుకున్న ఖమ్మం జీఆర్పీ ఎస్ఐ భాస్కర్‌రావు సిబ్బందితో కలిసి మూడు గంటల పాటు గాలించగా రామన్నపేట వద్ద సద్రై మృతదేహం లభించింది. అనంతరం మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు సాయంతో మార్చురీకి తరలించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరు..

కొణిజర్ల: గుర్తు తెలియని వాహనం ఢీకొని మతిస్థిమితం లేని వ్యక్తి మృతి చెందాడు. ఎస్ఐ జె.శంకరరావు, మృతుడి తల్లి తెలిపిన వివరాల ప్రకారం.. వైరా మండలం ముసలిమడుగుకు చెందిన రాచబంటి ముత్తయ్య(39)కు కొంతకాలంగా మతి స్థిమితం లేకపోవడంతో ఖమ్మంలోని అన్నం ఫౌండేషన్‌లో ఉంచారు. మూడు రోజుల క్రితం ఆయన ఆరోగ్యం మెరుగైందని ఇంటికి పంపించగా, ముత్తయ్య గురువారం సాయంత్రం తల్లి వెంకటనరసమ్మతో గొడవ పడి తన అక్క ఉండే రఘునాథపాలెం వెళ్తున్నట్లు చెప్పి కాలినడకన బయలుదేరాడు. అయితే, శుక్రవారం తెల్లవారుజామున తనికెళ్ల సమీపంలో గుర్తు తెలియని వాహనం ఆయనను ఢీకొట్టడంతో అక్కడే మృతి చెందాడు. ఈమేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కుక్కల దాడిలో కణుజు మృతి


పత్తి చేనులో పడి ఉన్న కణుజు మృతదేహం

కొణిజర్ల: అటవీ ప్రాంతం నుంచి వచ్చిన ఓ వన్యప్రాణి వీధికుక్కల దాడిలో హతమైంది. అటవీ ఉద్యోగులు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని ప్రాంతం నుంచి శుక్రవారం ఉదయం వచ్చిన కణుజు మండలంలోని గుబ్బగుర్తి అటవీ ప్రాంతం సమీపాన పెద్దరాంపురం పొలాల్లో మేస్తోంది. దీన్ని గమనించిన వీధి కుక్కలు వెంట పడి దాడి చేశాయి. దీంతో తీవ్రంగా గాయపడిన కణుజు మృతి చెందగా స్థానికులు ఇచ్చిన సమాచారం ఫారెస్ట్ రేంజర్ బెల్లం రాధిక, సెక్షన్ ఆఫీసర్ రామ సిబ్బందితో చేరుకుని పరిశీలించారు. అనంతరం కొణిజర్ల పశు వైద్యాధికారి సంజయ్‌రెడ్డితో పోస్టుమార్టం చేయించి కణుజు కళేబరాన్ని దహనం చేశారు.

9వ తరగతి విద్యార్థిని ఆత్మహత్యాయత్నం


పాఠశాల వద్ద మాట్లాడుతున్న విద్యార్థి బంధువులు

ఖమ్మం సహకారనగర్: ఖమ్మం ముస్తఫానగర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నా యి. మూడు రోజుల క్రితం హిందీ ఉపాధ్యాయురాలు అసభ్యంగా మాట్లాడడంతో మనస్థాపానికి గురైన విద్యార్థిని గుర్తుతెలియని మాత్రలు మింగినట్లు తెలిసింది. దీంతో బుధవారం తనకు అనారోగ్యంతో ఉందని ఆమె ఇంటికి వెళ్లగా విషయాన్ని గుర్తించిన కుటుంబీకులు ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. అయితే, ఇప్పటివరకు పాఠశాల బాధ్యులు పట్టించుకోవడం లేదని కుటుంబ సభ్యులు ఆరోపించారు. అంతేకాక వివిధ విద్యార్థి సంఘాల నాయకులు శుక్రవారం పాఠశాల ఎదుట ఆందోళనకు దిగగా, పోలీసులు చేరుకుని సర్దిచెప్పి పంపించారు.

సైబర్ నేరగాళ్ల ఎత్తుగడకు చెక్

- రూ.3.43లక్షలు ఫ్రీజ్ చేసిన పోలీసులు

ఖమ్మంక్రైం: సైబర్ నేరగాళ్ల వలలో పడి ఓ యువతి రూ.3.43లక్షలు కోల్పోగా సకాలంలో స్పందించిన పోలీసు కమిషనర్ సునీల్‌దత్ నేతృత్వాన సైబర్ పోలీసులు ఆ డబ్బును నేరగాళ్ల బ్యాంక్ ఖాతా నుంచి డ్రా చేయకుండా అడ్డుకున్నారు. ఖమ్మం నగరానికి చెందిన ఓ యువతి ఫోన్‌కు వివిధ నంబర్ల లింక్‌లు వచ్చాయి. వీటిని క్లిక్ చేస్తే రోజుకు రూ.3వేల నుంచి రూ.4వేల ఆదాయం వస్తుందని సూచించడంతో ఆమె అలాగే చేసింది. దీంతో విడతల వారీగా రూ.3.43లక్షలు అకౌంట్ నుంచి విత్ డ్రా అయినట్లు తెలుసుకున్న ఆమె 1930కు ఫోన్ చేసింది. ఈ మేరకు ఖమ్మం సైబర్ పోలీసులు ఆ డబ్బు జమ అయిన ఖాతాలను ఫ్రీజ్ చేయించారు. కాగా, సులభంగా డబ్బు వస్తుందనే చెప్పే వారి మాటలు నమ్మొద్దని సూచించారు. ఎవరైనా మోసపోతే 1930 టోల్ ఫ్రీ నంబర్ సకాలంలో సమాచారం ఇస్తే ఫలితం ఉంటుందని తెలిపారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్ట్

ఖమ్మంక్రైం: గంజాయి తరలిస్తున్న ఇద్దరిని ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం ఉదయం తనిఖీలు చేపట్టగా ఖమ్మంలోని అల్లిపురం ప్రాంతంలో కొత్తగూడెంకు చెందిన తంబాల ఉపేందర్, తూము పురుషోత్తం అనుమానాస్పదంగా కనిపించారు. దీంతో వీరి వద్ద పరిశీలించగా 180 గ్రాముల ఎండు గంజాయి లభ్యమైంది. దీంతో గంజాయి, బైక్‌ను స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపరిచారు. తనిఖీల్లో ఎక్సైజ్ సీఐ బి.కృష్ణ, ఎస్సై కె.సాయిబాబా, సిబ్బంది పాల్గొన్నారు.

గంజాయి సాగు కేసులో నిందితుడి అరెస్ట్

చింతకాని: గంజాయి మొక్కలను ఇంట్లో పెంచుతున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై నాగుల్‌మీరా తెలిపారు. మండలంలోని నాగులవంచకు చెందిన కందిమళ్ల వెంకటి తన ఇంటి ఆవరణలో గంజాయి మొక్కను పెంచడమే ఎండు గంజాయి అమ్ముతున్నట్లుగా గురువారం గుర్తించారు. ఈమేరకు ఆయనను శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.